క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో అన్న సమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి రమణ తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో గరుడాద్రి వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ సేవకుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, చైర్మన్ దొడ్డి రమణ ప్రారంభించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఎం.అప్పలరెడ్డి, పెంటకోట రాజు, రామలక్ష్మి, స్వాతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడికి జ్యేష్ఠాభిషేకం



జగన్నాథస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డులోని అగనంపూడి జగన్నాథస్వామి సత్రం పరిధిలో కొలువై ఉన్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా శనివారం జ్యేష్ఠాభిషేకం కనులపండువగా జరిపించారు. ఈ సందర్భంగా సుభద్ర, బలభద్ర సహిత జగన్నాథస్వామి వారికి 108 కొబ్బరి బొండాల (కలశాల) నీళ్లతో అభిషేకం జరిపించారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ ఆధ్వర్యంలో పండితులు వినాయకుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గురు సంతోష్ మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ వరకు స్వామి వారికి నైవేద్యంగా కొబ్బరి నీళ్లను సమర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పండా కుటుంబీకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమి నాయకులు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎన్డీఏ కూటమిలో ఉన్న పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి పెంచాలని విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నాయకులు ప్రగడ వేణుబాబు, ఎం.వి.రమణ, ఎన్నేటి రమణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1227వ రోజు, శనివారం టీపీపీ, పీఈఎం, రెడ్, స్టోర్స్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ పక్క కేంద్ర ఉక్కు సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో ఆందోళన చెందొద్దని చెబుతున్నా మరోపక్క ఉక్కు ఆస్తుల అమ్మకానికి సిద్ధం కావడం రాష్ట్ర ప్రజలను, ఉక్కు ఉద్యోగులను, నిర్వాసితులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఉక్కు పరిరక్షణ విషయంలో కూటమి నాయకులు చొరవ చూపాలని కోరారు.

బడి ఈడు పిల్లలను గుర్తిద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది



బడికి పోదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

- సమన్వయంతో శతశాతం అక్షరాస్యత సాధిద్దాం
- పెదగంట్యాడ ఎంఈవో శ్రీనివాసరావు

గాజువాక : బడిఈడు పిల్లలను గుర్తించే బాధ్యతను అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు తీసుకోవాలని విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారి ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం లక్షల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. బడిఈడు పిల్లల్ని అన్ని శాఖల అధికారులు గుర్తించాలని, శత శాతం అక్షరాస్యతను సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చేనెల 13 వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో లేబర్ ఐసీడీఎస్, లేబర్ డిపార్టుమెంట్ ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. చిన్నారులను గుర్తించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లకు పైబడ్డ చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం స్టూడెంట్ కిట్లు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, కె.రమణాజీ, ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్టు అధికారి నీలిమ, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి నరేష్, జీవీఎంసీ సూపరింటెండెంట్ ఈశ్వరి పాల్గొన్నారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న హార్బర్ క్రైం సీఐ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హార్బర్ క్రైం సీఐ జి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అయ్యన్నపాలెం పార్కులో క్రీడాకారులు, వాకర్లతో శనివారం ఆయన మాట్లాడారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. ఎండలు ఎక్కువగా ఉంటున్నందున రాత్రి వేళల్లో మేడలపై, ఆరుబయట నిద్రించే వారు ఇళ్లకు తాళాలు వేసి, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా ఇళ్లకు తాళం వేసి, ఊళ్లకు వెళ్తే సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే, ఆయా ఇళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లేటపుడు తమ ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, చైన్ స్నాచర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ అప్పలరాజు, హెడ్ కానిస్టేబుల్ రాజేష్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ వితరణ



రోడ్డుపక్క వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: వాసవీ క్లబ్ అగనంపూడి కమిటీ విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టింది. ఉదయాస్తమాన కార్యక్రమంలో భాగంగా అగనంపూడి వాసవీ క్లబ్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీ సామగ్రి అందించింది. అలాగే, రోడ్డుపక్కన వ్యాపారాలు సాగించే వ్యాపారులకు గొడుగులు, ట్రాఫిక్ పోలీసులకు తువ్వాలు, మాస్కులు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాసవి క్లబ్ అంతర్జాతీయ కమిటీ ప్రతినిధులు ఆడగళ్ల సునీత, పుప్పల వెంకటరత్నం మాట్లాడుతూ అగనంపూడి కమిటీ చురుగ్గా వ్యవహరిస్తూ నెలనెలా సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ వుడా సత్యనారాయణ (మయూరి బుజ్జి), జిల్లా ప్రతినిధులు మహర్షి, గున్నయ్యశెట్టి, గణేష్, గురునాథం, సత్తిబాబు, వరలక్ష్మి, బ్రహ్మేశ్వరరావు, గాంధీ, వరహాలశెట్టి, మంగ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోర్లు ప్రారంభం



సిద్ధార్థనగర్‌లో బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థ నగర్‌లో ఏర్పాటు చేసిన రెండు చేతిబోర్లను కార్పొరేటర్ బొండా జగన్ ప్రారంభించారు. కాలనీలో నీటి ఎద్దడి నివారణకు వినాయకుని గుడి వద్ద, అంబేడ్కర్ పార్కు ఆవరణాల్లో రెండు గొట్టపు బావులను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి నివారణకు పైప్‌లైన్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. తాత్కాలికంగా గొట్టపు బావులు తవ్వించామని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధార్థ నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు బలిరెడ్డి నాగేశ్వరరావు, జె.ఎస్.మూర్తి, ఎం.సూర్యనారాయణ, కృష్ణనాయక్, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



గణపతి హోమం నిర్వహిస్తున్న కృష్ణన్ నంబూద్రి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో 34వ పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అయ్యప్ప దేవాలయ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ అర్చకులు కృష్ణన్ నంబూద్రి గణపతి హోమం నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 25 వరకు కొనసాగుతాయని అయ్యప్ప దేవాలయ సమితి అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు, కార్యదర్శి శేషగిరిరావు తెలిపారు. ఆదివారం గణపతి హోమం, దేవీ పూజలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఉక్కు స్టోర్స్‌లో కార్మిక చట్టాలు అమలు చేయాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్‌లో కార్మిక చట్టాలు అమలు జరిగేలా చూడాలని ఉక్కు కార్మిక సంఘం నాయకుడు పట్టా రామ అప్పారావు డిమాండ్ చేశారు. అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టోర్స్‌లో 25 నుంచి 28 సంవత్సరాల పాటు అనేక మంది క్యాజువల్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నారని ఆరోపించారు. స్టోర్స్‌ను నిర్వహించేది కార్మిక సంఘాల నేతలే అయినా ఉద్యోగులు స్థితి గతులు మారలేదని ఆరోపించారు. గతపాలక పక్షం సిబ్బందిని నియమించకపోవడం, ఉద్యోగ విరమణ వల్ల ఏర్పడిన ఖాళీలను కూడా భర్తీ చేయకపోడం వల్ల పనిచేస్తున్న కార్మికులపై అదనపు భారం పడుతోందన్నారు. ఈ విషయంలో జిల్లా కార్మిక, సహకార శాఖల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుడు నిమ్మకూరి రమేష్ తదితరులు మాట్లాడారు.

కార్మిక హక్కుల రక్షణకు నిరంతర పోరాటం

- సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు
- కార్మికులకు శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న జగ్గునాయుడు

ఉక్కునగరం: కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగవంతంగా కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేస్తోందని, అందులో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ప్రైవేటుపరం చేసేందుకు పూనుకుంటోందన్నారు. ప్లాంట్‌ను ఆర్థికంగా ఆదుకోవాల్సింది పోయి ప్లాంట్ ఆస్తులను అమ్మకానికి పెట్టడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు ప్రిన్సిపాల్‌గా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. తరగతులకు స్టీల్‌ప్లాంట్, బీహెచ్ఈఎల్, హెచ్ఎస్ఎల్, హెచ్‌పీసీఎల్, పోర్టు ట్రస్ట్, మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



కలశ స్నపనం చేస్తున్న అర్చకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారం రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆరాధన, పారాయణం, నిత్య హోమం, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణ, నవకలశ పూజ, చక్రస్నానం జరిపించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఆలయ ధర్మకర్త ఇ.కె. చారి దంపతులు, కమిటీ ప్రతినిధులు సాయిబు నాయుడు, నరసింగరావు, గురనాథరావు, కృష్ణారావు, సత్యనారాయణ, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, గొల్లవిల్లి వెంకటరావు పాల్గొన్నారు.

సమాచార వ్యవస్థలో ఆవిష్కరణలు ప్రోత్సహించాలి

బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్, విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: సమాచార వ్యవస్థలో ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్ సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలతో బీఎస్ఎన్ఎల్ పరస్పర ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాచార రంగంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం, నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఒప్పందం చేయడం జరిగిందన్నారు. వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ అభివృద్ధి చెందిన తరువాత టెలికాం రంగంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థులకు మంచి భవిష్యత్ అందివ్వడమే విజ్ఞాన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి రమేష్‌బాబు, ఈసీఎం విభాగాధిపతి ఉమామహేశ్వరి, సంపత్, దక్షిణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశునికి విశేష పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో దేవేరులతో శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి శనివారం విశేష పూజలు చేశారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. పూజల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలేశుని విశేష పుష్పాలతో అలంకరించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువజాము 2 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలి వచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు ప్రత్యేక టికెట్లు అందుబాటులో ఉంచారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా చక్రస్నానం..

అల్లిపురం : ఇసుకకొండపై వెలసిన శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం దేవస్థానం ప్రధాన అర్చకులు ఫణిహారం నరసింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్కుల సహకారంతో పూర్ణాహుతి, ధ్వజావరోహణం, చక్రస్నానం, అవభృదం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా భీమిలి శాసన సభ్యుడు గంటా శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు పుష్పయాగం..

శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారి పుష్పయాగం అనంతరం పవళింపు సేవ నిర్వహించనున్నట్లు ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. పవళింపు సేవతో కల్యాణ వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా మలేరియా అధికారిని సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం జిల్లాలో 'స్టాప్ డయేరియా' ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. ఐఆర్‌ఏడీ యాప్ అప్‌లోడ్ గురించి తెలిపారు. అంతే కాకుండా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్, ఫారం–ఎఫ్ అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ తదితర వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఆస్పత్రులు రెన్యువల్స్, రిజిస్ట్రేషన్స్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఫారం–ఎఫ్ ఆన్‌లైన్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ కాన్పులు చేయాలని, సాధ్యమైనంత వరకు సి–సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసీరాజ్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులకు సంబంధించిన రిపోర్టులు తెలియజేసేటప్పుడు రోగుల ఆధార్ కార్డు, ఇతర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దాని వలన రోగిని సులభంగా గుర్తించి మెరుగైన వైద్య సేవలందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ జగదీష్ ప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐఆర్‌ఏడీ మెడికల్ అధికారి డాక్టర్ ఎ.యామినీకాంతి, జిల్లా గణాంక అధికారి మురళీకృష్ణ, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారులో పార్కింగ్ నిర్వహణకు టెండర్లు

గోపాలపట్నం: గోపాలపట్నం, కంచరపాలెం రైతు బజార్లలో వాహనాల పార్కింగ్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఆసక్తిగల వారు రూ10000 ధరావత్తు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంయుక్త కలెక్టర్ రైతు బజార్లు, విశాఖ పట్నం పేరున తీసిన డీడీ జత చేసి దరఖాస్తును జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్– 8–202/2, ఆర్ఆర్‌వీ పురం, గోపాలపట్నంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 28 మధ్యాహ్నం 1గంట లోగా దరఖాస్తులు చేయాలని తెలిపారు. 28న సాయంత్రం 4 గంటలకు టెండర్ తెరచి కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంచరపాలెం రైతు బజారులో పార్కింగ్ ధర రూ.47,250, గోపాలపట్నం రైతుబజారులో రూ. 77,164 ప్రభుత్వ ధర ఉంటుందని తెలిపారు. సైకిల్‌కి రూ.2, ద్విచక్రవాహనానికి రూ.5, ఆటోకు. 10, కారుకు రూ.20 వసూలు చేయాలి. గుర్తింపు పొందిన రైతుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9030819082 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఉపేంద్ర

గోపాలపట్నం: మాదక ద్రవ్యాలను దరి చేరితే అనర్థమేనని గోపాలపట్నం ఎక్సైజ్ ఎస్‌ఐ ఎల్. ఉపేంద్ర అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో శనివారం మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి, హెరైన్, కొకైన్, మద్యం వంటివి అలవాటు చేస్తున్నారన్నారు. వాటి జోలికి వెళ్లి జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇవి ఆరోగ్యాన్ని పాడు చేయడమే కాకుండా మానసికంగా కుంగి పోతారన్నారు. మాదక ద్రవ్యాలు రవాణా చేయడం, అమ్మడం వాడడం నేరం అన్నారు. ఇలాంటి వారు ఎక్కడైనా కనిపిస్తే 14500 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.